క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: బోగోలు మండలం జక్కేపల్లిగూడూరులో గ్రామదేవత కనకదుర్గమ్మకు స్థానికులు ఆదివారం భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. గ్రామ సంప్రదాయాన్ని అనుసరించి వేకువజాము నుంచే మహిళలు, గ్రామస్తులు కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి పొంగళ్లు నివేదించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

14న కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ సమావేశం

వరికుంటపాడు: వైఎస్సార్ జిల్లా పీపీ కుంటలో ఈ నెల 14న ఏపీ కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం సమావేశం జరుగుతుందని ఫోరం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ చల్లగాలి వెంకట్ మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రం నలుమూలల నుంచి సభ్యులు హాజరవుతారన్నారు. ఫోరం అభివృద్ధికి రాష్ట్ర నాయకులు తగు సూచనలు, సలహాలు అందిస్తారన్నారు.

ఆర్ఎంపీకి డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న ఆర్ఎంపీ ఖాజామియా

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో ఆర్ఎంపీగా వైద్య సేవలు అందిస్తున్న ఖాజామియాకు డాక్టరేట్ లభించింది. ఎన్నో సంవత్సరాలుగా ఆర్ఎంపీగా వైద్యసేవలు అందించడంతో పాటు సామాజిక సేవలు అందించడంతో న్యూఢిల్లీకి చెందిన మ్యాజిక్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఆయన సేవలను గుర్తించింది. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీలో గౌరవ డాక్టరేట్‌తో పాటు లైఫ్‌టైం అచీవ్‌మెంట్‌తో ఆదివారం ఆయన్ను సత్కరించారు. సుమారు 30 సంవత్సరాలుగా వైద్యసేవలు అందిస్తూ రెడ్‌క్రాస్ సొసైటీ, సెయింట్ జాన్ అంబులెన్స్ సంస్థ ద్వారా అనేక ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, ప్రభుత్వ ఆరోగ్య సంక్షేమ శిబిరాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారు. కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ నెలూరు జిల్లా అధ్యక్షుడిగా ఖాజామియా సేవలందించారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



ఉదయగిరి చర్చిలో దైవసందేశాన్ని అందిస్తున్న పాస్టర్ సుధీర్‌కుమార్

ఉదయగిరి: మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయగిరి పట్టణంతో పాటు అప్పసముద్రం, గండిపాళెం, పుల్లాయపల్లె, ఆర్లపడియ, దాసరపల్లి, వెంగళరావునగర్, అయ్యవారిపల్లె, గన్నేపల్లి తదితర గామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బర్డిట్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో సంఘ కాపరి రెవరెండ్ పరిమి సుధీర్‌కుమార్ దైవసందేశాన్ని అందించారు. ఏసుప్రభువు గుడ్‌ఫ్రైడే రోజు మరణించి ఈ మూడో రోజు తిరిగి సజీవంగా లేచిన సందర్భంగా ఈస్టర్ డే నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పలువురు భక్తిగీతాలు ఆలపించారు. సంఘ పెద్దలు, కాపరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలో పలు గ్రామా ల్లోని చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలను విద్యుద్దీపాలతో అలంకరించారు. మండలంలోని వరికుంటపాడు, వేంపాడు, బోయమడుగుల, తిమ్మారెడ్డిపల్లి, విరువూరు, పెద్దిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని చర్చిల్లో పాస్టర్లు దైవ వాక్యాలు అందించి గీతాలాపనలు చేశారు.

ధ్యానంతోనే ఆరోగ్య సిద్ధి



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ రవిచంద్ర

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా నిత్యం ధ్యానం చేయడం అలవర్చుకుంటే రోగాలకు దూరంగా ఉండొచ్చునని మంచి ఆరోగ్యం కలుగుతుందని ప్రముఖ పిరమిడ్ ధ్యాన మాస్టర్ రవిచంద్ర అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని శ్రీషిరిడీ సాయి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఆదివారం ధాన్యంపై అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహించారు. మాస్టర్ రవిచంద్ర ధ్యానంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అష్టకష్టాలకు కోరికలే కారణమని వాటిని అదుపులో ఉంచుకోవాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి ధ్యానసాధనే పరిష్కారమని ఆయన వివరించారు. ఈ శిక్షణా తరగతుల్లో మహిళలు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమకు వెన్నుదన్ను

రాష్ట్రంలో ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతటి ప్రాధాన్యం ఇస్తున్నారో పశువుల సంరక్షణకు అంతే ప్రాధాన్యం కల్పిస్తున్నారు. రైతులకు పాడి, పంట రెండు కళ్లతో సమానం. ప్రకృతి వైపరీత్యాలు, అనుకోని విపత్తులతో పంట నష్టపోయినా పశుసంపద మాత్రం అన్నదాతలకు అండగా నిలుస్తోంది. పశువులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు ఇప్పటికే 108 తరహాలో అంబులెన్స్‌లు, వెటర్నరీ వైద్య సిబ్బంది ఏర్పాటు చేయడంతో పాటు టోల్ ఫ్రీ నంబరును కల్పించారు.

- నాడు–నేడు తరహాలో పశువైద్యశాలల అభివృద్ధికి ప్రణాళికలు
- 108 తరహాలో పశువులకు కూడా అంబులెన్స్‌లు
- వెటర్నరీ వైద్యుల పోస్టుల భర్తీకి చర్యలు
- అత్యవసర వైద్యసేవలకు 1962 టోల్ ఫ్రీ నంబరు



కావలి/బిట్రగుంట: జిల్లాలోని డెల్టా ప్రాంతంతో పాటు నాన్ డెల్టాలో వరి తర్వాత పాడి పరిశ్రమే కీలకంగా ఉంది. ప్రతి రైతు ఇంటా పాడి తప్పనిసరిగా ఉంటుంది. జిల్లాలోని 38 మండలాల్లో ఆరు లక్షల గేదెలు, 50 వేల ఆవులు, 14 లక్షల గొర్రెలు, మేకలు ఉన్నాయి. వీటిల్లో పాలిచ్చే గేదెల సంఖ్య 25 శాతం వరకు ఉంటాయని అంచనా. ప్రధానంగా పెన్నా పరీవాహక ప్రాంతంలోని డెల్టా ప్రాంతాల్లో నాటు రకం గేదెలతో పాటు పాలు అధికంగా ఇచ్చే గ్రేడెడ్ ముర్రా గేదెలు కూడా ఎక్కువగా ఉన్నాయి. నాన్‌డెల్టా ప్రాంతాలైన ఉదయగిరి, రాపూరు, తదితర ప్రాంతాల్లో నాటు గేదెలు అధికంగా ఉన్నాయి. పాడి రైతులకు అండగా నిలవడంతో పాటు పశుసంపదను వృద్ధి చేయడం, పాల దిగుబడులు పెంచేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక చర్యలు చేపట్టింది. నేరుగా పాడి రైతు ఇంటి వద్దే పశువులకు అవసరమైన వైద్యసేవలు అందించేందుకు వీలుగా జిల్లాలోని 544 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 320 మంది వెటర్నరీ అసిస్టెంట్‌లను ప్రత్యేకంగా నియమించింది. వీరి ద్వారా పశువులకు అవసరమైన టీకాలు వేయించడం, కృత్రిమ గర్భదారణ, దూడల సంరక్షణ, నట్టల నివారణ మందులు తదితర సేవలు అందిస్తుంది. జిల్లాలో ప్రస్తుతం గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం పూర్తయింది.

పశువులకు 108 తరహా అంబులెన్స్‌లు

నోరులేని మూగజీవాలను రక్షించడం కోసం ఇంటి వద్దనే పశువైద్య సేవలను అందించడానికి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో 108 తరహాలో అంబులెన్సులు (వెటర్నరీ) క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాలో తొలి దశలో 3, రెండో విడతలో 9 అంబులెన్స్‌లు వచ్చాయి. మొబైల్ అంబులెన్స్ లతో పశువులకు నేరుగా ఇంటి వద్దనే వైద్య సేవలు ఈ మొబైల్ అంబులెన్సులు స్పాట్ డయాగ్నసిస్, అత్యవసర కేసులకు హాజరుకావడంతో పాటు పశువైద్య ప్రథమ చికిత్స సేవలను అందిస్తాయి. ఈ అంబులెన్సులు అందించే ప్రధాన సౌకర్యాల్లో ఒకటి 'హైడ్రాలిక్ లిఫ్ట్' సౌకర్యం. జంతువులను ఎత్తడానికి, అత్యవసర పరిస్థితుల్లో సమీప ప్రభుత్వ వెటర్నరీ ఫెసిలిటీకి తరలించడానికి ఇది ఎంతో ఉపకరిస్తుంది. ప్రతి అంబులెన్స్‌కు ఒక పశు వైద్యుడు, వెటర్నరీ డిప్లొమా చదివిన ఒక పారా–వెటర్నరీ సహాయకుడు, వాహనం డ్రైవర్ ఉంటారు. ఇందు కోసం ఖాళీగా ఉన్న వెటర్నరీ డాక్టర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు రైతు భరోసా కేంద్రాల్లో వెటర్నరీ వైద్య సేవలు అనుసంధానం చేయాస్తున్నారు. అంబులెన్స్‌ల సేవల కోసం 24/7 టోల్ ఫ్రీ నంబరు 1962ను ఏర్పాటు చేశారు.

పశువులకు ఖరీదైన మందులు

టీడీపీ హయాంలో పాడిపరిశ్రమను అప్పటి ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం చేసింది. పశువులకు అవసరమైన వైద్యసేవలను అటకెక్కించింది. గతంలో గేదెలకు చిన్నపాటి వ్యాధి సోకినా మందులు అందుబాటులో ఉండేవి కావు. పొదుగువాపు వంటి వ్యాధులు వస్తే ప్రైవేట్‌గా మందులు కొనుగోలు చేసేందుకు రూ.6,000 వరకు వెచ్చించాల్సి వచ్చేది. దీంతో రైతులు ఆర్థికంగా కుంగిపోయారు. విధిలేని పరిస్థితుల్లో చాలా మంది గేదెలను సంతలకు తరలించి విక్రయించుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా పాడి పరిశ్రమకు అధిక ప్రాధాన్యమిచ్చారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో ప్రత్యేకంగా వెటర్నరీ అసిస్టెంటల్ ద్వారా సేవలందించడంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ తరహాలో పశువులకు క్యాటిల్ డాక్టర్, యానిమల్ హెల్త్ కార్డులు, పశువుల బీమా తదితర పథకాలు పాడి పరిశ్రకు నూతన జవసత్వాలు అందించాయి. పశు వైద్యశాలల రూపురేఖలు మార్చేందుకు కూడా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పాఠశాలలు, పీహెచ్‌సీల్లో అవలంభిస్తున్న 'నాడు–నేడు' తరహాల్లో పశువైద్యశాలల అభివృద్ధికి చర్యలు చేపడుతోంది.



పశువుల కోసం ఏర్పాటు చేసిన అంబులెన్స్

గ్రామాల్లోనే సేవలు



పశువులు, ఆవులు, గేదెలకు ఏవైనా సమస్యలు ఆరోగ్య సమస్యలు వస్తే పశుసంవర్థకశాఖ సిబ్బంది గ్రామాల్లోని తమ ఇళ్ల వద్దకు వస్తున్నారు. పశువులను పరిశీలించి జాగ్రత్తలకు సంబంధించిన సూచనలు తెలియజేస్తున్నారు. మందులు కూడా ఇస్తున్నారు.

– దాసరి శ్రీహరి, పాడి రైతు, గ్రద్దగుంట, అల్లూరు మండలం

నాడు–నేడు తరహాల్లో పశువైద్యశాలల అభివృద్ధి

ప్రభుత్వ ఆదేశాల మేరకు నాడు–నేడు తరహాలో జిల్లాలోని పశు వైద్యశాలలను అభివృద్ధి చేయడం, మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వేసవి తీవ్రత పెరుగుతుండటంతో పాడిరైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా గ్రామాల్లో అవగాహన కలిగించే కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం.

– పరమేశ్వరుడు, జేడీ, పశుసంవర్థకశాఖ, నెల్లూరు

తాజాగా జిల్లాలోని పశువుల ఆసుపత్రులకు రూ.కోటి విలువైన మందులు పంపిణీ చేసింది. పశువులకు కీలకమైన టీకాలు, మినరల్ మిక్షర్, క్యాల్షియం సిరప్, తదితర మందులతో పాటు పలు అత్యవసరమైన, సాధారణ వ్యాధులకు సంబంధించిన మందులను అందించింది. వీటితో పాటు ఆయా మండలాల్లోని పశుసంపద ఆధారంగా డీవార్మింగ్ మందులు, ఇంజక్షన్స్, టానిక్ పౌడర్స్, దూడల సంరక్షణకు అవసరమైన మందులను పంపిణీ చేసింది. పశువైద్యశాలల్లో ఖరీదైన మందులు అందుబాటులో ఉంచడంతో పాటు వెటర్నరీ అసిస్టెంట్‌ను నియమించడం, పాలసేకరణ ధరలు పెంచడంతో ఔత్సాహిక యువత కూడా పాడిపరిశ్రమ వైపు అడుగులు వేస్తున్నారు. గడిచిన మూడేళ్ల కాలంలో జిల్లాలో డెయిరీ ఫాంల ఏర్పాటు 20 శాతానికిపైగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఆత్మకూరులో గడపగడపకు నేడు

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. పట్టణంలోని 3, 4, 21 వార్డుల పరిధిలో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు సచివాలయ కన్వీనర్లు పాల్గొనాలని కోరారు.

11న ప్రత్యేక రెవెన్యూ సదస్సు

ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సంబంధించిన రెవెన్యూ, భూ పట్టాదారు పాసు పుస్తకాలు తదితర సమస్యల పరిష్కారం కోసం మంగళవారం సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలోని ఎంజీఆర్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమీక్షలో అన్ని మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొంటారని, అర్జీలపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

సీసీ రోడ్డుకు చిన్నారుల వినతి



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు పంచాయతీ మజరా కోటపాడుకు నాగులపాడు రోడ్డు నుంచి సిమెంట్ రోడ్డు నిర్మించాలని ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ ఆదివారం ఆ గ్రామానికి చెందిన చిన్నారులు విజ్ఞప్తి చేశారు. తమ గ్రామానికి అర కిలోమీటరు దూరం సిమెంట్ రోడ్డు నిర్మిస్తే వర్షాకాలంలో రాకపోకలు సాగించేందుకు సౌకర్యంగా ఉండడంతో పాటు వందలాది ఎకరాల మాగాణి భూములకు, పంట పొలాలకు వెళ్లే రైతులకు ఇబ్బందులు ఉండవని తెలిపారు.

సింహవాహనంపై దేవదేవేరులు

సంగం: సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు ఆదివారం స్వామి అమ్మవార్లకు సింహవాహన సేవ ఘనంగా జరిగింది. అర్చకులు, స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి సింహ వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం మంగళవాయిద్యాల మధ్య స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఈ కార్యక్రమానికి బలిజ సంఘం ఉభయకర్తలుగా వ్యవహరించింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెరుమాళ్ల రవీంద్రబాబు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



సింహవాహనంపై దేవదేవేరులు

బైక్ చోరీపై ఫిర్యాదు

సంగం: బస్టాండ్ సెంటర్‌లో పార్కింగ్ చేసిన బైక్ శనివారం రాత్రి చోరీకి గురైనట్లు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు అందింది. సంగం గ్రామానికి చెందిన పఠాన్ సాధిక్ బస్టాండ్ సెంటర్‌లో కిళ్లీ వ్యాపారి. తన ఫ్యాషన్ ప్లస్ బైక్‌ను షాపు ఎదురుగా ఐఎస్ఆర్ స్వీట్ బేకరీ పక్కన శనివారం రాత్రి ఉంచాడు. వ్యాపారం చేసుకుని రాత్రి 10.30 గంటలకు వెళ్లి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో సాధిక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్నతోనే రాష్ట్ర భవిష్యత్



చిలకపాడులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సర్పంచ్ రమాదేవి



సోమశిల: బొమ్మవరం అగ్రహారంలో ..



దుత్తలూరు: ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ జయంత్‌రెడ్డి, కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి

ఆత్మకూరు: పార్టీలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నతోనే మా భవిష్యత్ అంటూ ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 4, 5, 12, 13, 21 వార్డుల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆయా వార్డు కౌన్సిలర్లు, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కౌన్సిలర్లు మహబూబ్‌బాషా, కొండా చిన్న వెంకటేశ్వర్లు, టి. తిరుపతమ్మ, కోడూరు కౌసల్యమ్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మర్రిపాడు: మండలంలో అన్ని గ్రామాల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని స్థానిక వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు నిర్వహించారు. అన్ని కుటుంబాల వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వారితో ఫోన్ చేయించి వారి అభిప్రాయాలను వివరించారు.

అనుమసముద్రంపేట: మండలంలోని కొండమీద కొండూరులో మండల జేసీఎస్ కో–ఆర్డినేటర్ పులిమి వెంకట రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్ గోసల శ్రీనివాసుల రెడ్డి, ఉప సర్పంచ్ కూరపాటి మురళీరెడ్డి, వలంటీర్లు, గృహసారథులతో కలిసి ఆదివారం జగనన్నేమా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలను విస్తృతంగా వారికి తెలిపారు.

సోమశిల: మండలంలో బొమ్మవరం అగ్రహారంలో మండల జేసీఎస్ కో–ఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ముమ్మరంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అక్కలరెడ్డి కొండారెడ్డి, సర్పంచ్ కారుదుంపల లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు, బోయలచిరివెళ్ల సచివాలయాల పరిధిలోని గొల్లపల్లి గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కరటంపాడు, బోయలచిరివెళ్ల సచివాలయాల కన్వీనర్లు షేక్ రఫీ, రావూరు శ్రీనివాసులురెడ్డి, ఆయా గ్రామాల గృహసారథులు పాల్గొన్నారు.

ఉదయగిరి: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై ఆదివారం మండల సచివాలయ కన్వీనర్లతో స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల సచివాలయ కన్వీనరు కల్లూరు కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో గృహసారథులకు కేటాయించిన 50 ఇళ్లకు వెళ్లి సర్వే చేయాలి తెలిపారు. ఈ నెల 20వ తేదీ లోపు పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి ఇంటికి జగన్న స్టిక్కర్ అంటించాలి అని చెప్పారు. ఈ సమావేశంలో జి.శ్రీనివాసరెడ్డి, అక్కి భాస్కరరెడ్డి, గోగుల వెంగళరెడ్డి, మర్తుజా తదితరులు ఉన్నారు.

కలిగిరి: మండలంలోని నాగసముద్రంలో ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి ఆధ్వర్యంలో 'జగనన్నే మన భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు రాగయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు. చిన్నఅన్నలూరు పంచాయతీ తూర్పుమాలపాళెంలో కేడీపాడు పీఏసీఎస్ చైర్మన్ ములకా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం 'జగనన్నే మన భవిష్యత్తు' నిర్వహించారు. అనంతపురంలో మెట్టుకూరి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా చేపట్టారు. జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, సర్పంచ్ రాగికుమారి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు: కొత్తపేట, వెంగన్నపాళెం, నర్రవాడ, తెడ్డుపాడు, తిమ్మాపురం పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం 'జగనన్నే మన భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మీసాల సుబ్బరాయుడు, సర్పంచ్ పెద్ద వెంగయ్య, స్థానిక నాయకులు తుమ్మల వెంగయ్య, దయాకర్, రామిరెడ్డి, సుధాకర్, చైతన్య, మీరావలి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: రాష్ట్రంలో పేద ప్రజల అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్ సీపీ మండల నాయకులు దండా కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అల్లూరు నగరపంచాయతీలోని తూర్పువీధి, చెర్లోసంఘం, కాలనీల్లో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నీలం సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు రూరల్: బోయలచిరివెళ్ల సచివాలయాల పరిధిలోని గొల్లపల్లిలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



కలిగిరి: తూర్పుమాలపాళెంలోజెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి తదితరులు

డీఎస్పీ మృతికి సంతాపం



ఆత్మకూరు: దివంగత డీఎస్పీ చిత్రపటానికి సెల్యూట్ చేస్తూ నివాళులర్పిస్తున్న పోలీసులు



మర్రిపాడు: డీఎస్పీ వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసులు

ఆత్మకూరు: ఉద్యోగ విధుల పరంగా ఆత్మకూరుతో ఎక్కువ అనుబంధం ఉన్న డీఎస్పీ కె.వెంకటేశ్వరరావు హఠాన్మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని ఆత్మకూరు పోలీసు అధికారులు, సిబ్బంది విచారం వ్యక్తం చేశారు. ఆత్మకూరు డీఎస్పీగా పనిచేసి ఐదు నెలల క్రితం బదిలీపై విజయవాడకు వెళ్లిన కె వెంకటేశ్వరరావు శనివారం రాత్రి విజయవాడలో మృతి చెందడంతో డివిజన్‌లోని పోలీసుల అధికారులు, సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పోలీసు అధికారులు, సిబ్బంది ఘన నివాళులర్పించారు. గతంలో ఆయన ఆత్మకూరు సీఐగా, ఇటీవలి వరకు డీఎస్పీగా పనిచేసి మంచి పేరు సంపాదించుకొని బదిలీపై వెళ్లారని ఇంతలో ఆయన మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఎం శివశంకర్‌రావు, సాయిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మర్రిపాడు: ఆత్మకూరు డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన డీఎస్పీ వెంకటేశ్వరరావు అకాలంగా మరణించడం బాధాకరమని మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకూరు సర్కిల్ సీఐగా, డీఎస్పీగా అనేక సేవలందించారనిన్నారు. సాధారణ బదిలీల్లో వెళ్లిన ఆయన శనివారం రాత్రి మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై శ్రీనివాసులరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంగం: ఆత్మకూరు నుంచి బదిలీపై వెళ్లిన డీఎస్పీ వెంకటేశ్వరరావు మరో ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ ఆదివారం మృతి చెందడంతో స్థానిక పోలీస్ సిబ్బంది దిగ్భ్రాంతికి చెందారు. పోలీస్‌స్టేషన్‌లో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంగం సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉదయగిరి: ఆత్మకూరు డీఎస్పీగా విధులు నిర్వహించి ఇటీవల ఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లి విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో మృతి చెందిన వెంకటేశ్వరరావుకు ఆదివారం ఉదయగిరి పోలీసులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐ వి.గిరిబాబు, ఎస్సై ఎస్.ప్రభాకర్ వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్టేషన్, సర్కిల్ కార్యాలయాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సంగం: నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది



ఉదయగిరి: నివాళులర్పిస్తున్న పోలీసు సిబ్బంది

గిట్టుబాటు ధర కల్పించాలని రైతుల వేడుకోలు

ఉదయగిరి: మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో పలువురు రైతులు పొలాల్లో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 3,000 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంట సాగు చేశారన్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి అమ్మకం సమయం వచ్చే సరికి సరైన ధర లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మొక్కజొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలన్నారు.



మొక్కజొన్న వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

చలివేంద్రం ఏర్పాటు

ఆత్మకూరు: పట్టణంలోని హిల్ రోడ్డులోని ఆటోనగర్‌లో స్థానిక కార్మికుల ఆధ్వర్యంలో ఆదివారం తాగునీటి చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో అనేక మెకానిక్, వెల్డింగ్ దుకాణాలు ఉండడంతో పాటు ఈ మార్గం మీదుగా అనేక ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే వారి కోసం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

